# కరుబుజ్జ తోట

తూరుపుపక్క కంచెకు ఒక సాట[1] కంతపడి బరెగొడ్లు దూరి తోట్లోకి వస్తావుండాయనీ, వాటిని కనిపెట్టుకోని వుండడం సావుజంపులుగా వుందనీ, అమ్మ జెప్పడం గ్యాపకమొచ్చి కొండిగాడు ఆ పక్కకు పోయినాడు. అప్పటికే రోజూ వస్తావుండాదని జెప్పిన దొంగముండాకోరుకొమ్ముల ఎనుము, కొమ్ముల్తో కంతపెద్దది జేసుకొంటా, దూరబోతాంది. "థేయ్ ! థేయ్ ! నీయమ్మ...." అని కొండిగాడు అదిలిచ్చినాడు. "తోట్లోకి పోదామంటే కుదరక పాయెనే" అనుకుంటా కోరుకొమ్ముల ఎనుము పాయె.

ఆ కంతపడిన కాడ కొండిగాడు కంపమండలు సరీగ్గా కప్పినాడు. గుడిసెకాడికిబోయి అడుండే రాగోలు[2] తీసుకోని, తోట బైటికి పోయి ఇంగా రెండు మూడు మండలు యేసుకొని తెచ్చి, ఆడేసి తొక్కి యిసికేసినాడు. వానికి ఈ పొద్దు మెడ యిరుకుబెట్టి బాగా నొప్పిగా వుండడంతో వాళ్ళ నాయన్తోపాటు కరుబుజ్జకాయ[3] లెత్తుకోని పొద్దుటూరు మారికెట్టుకు వాళ్ళమ్మ పోయింది. కంత బూడ్సినాక కాయలేమన్నా తెగినాయేమోనని కొండిగాడు తోటంతా తిరిగినాడు. తోట ఒక్కసారిగా మాగడం మొదలు పెట్టడంతో అన్ని సామెర్లలోనూ[4] కాయలు తెగినాయి. తెగిన కాయల్లో యింగన్, బత్తాన, పప్పాయి, పచ్చబిళ్ళ కాక కూజా కాయలు గూడా వుండాయి. గంప తెచ్చి, అన్నిట్నీ గుడిసెలోకి మోసినాడు.

"ఈ పొద్దు మాపిటేలకల్లా నాలుగైదు గంపల కాయలు తెగేట్టుండాయి, రేపు యిద్దరు కూలోళ్ళను గూడా పిల్సుకోవాల్నేమో, నాయినొచ్చినాక అడగాల" అనుకుంటా, గుడిసె పక్క సెలెంలోకి దిగి మొకం కడిగినాడు. మొకం కడగడమంటే నున్న యిసుక యేలిమీదేసి యిట్టా అట్ట పండ్లకు రుద్ది, నీళ్ళు పుక్కిలిచ్చి సూసినాడు. "సెలమ నీళ్లు సొదుం[5] వాసన వస్తావుండాయి" అనుకొన్నాడు. గుడిసెలోకి బోయి బుట్టి[6]లో వున్న సద్ది దిక్కు సూసినాడు. అందులో రొంత కొరబువ్వా, సింతపండు కారెమూ వుంది.

"ఒక యింగన్ కాయను కోసుకోని తింటే ఎట్టుంటాది!" అని తమాసకు అనుకొన్నాడు. అది సిన్నదైనా రూపాయీ, రూపాయిన్నరా సేస్తాది. మంచి తీపి రకం. అదే కూజా కాయగానైతే ఎంత పెద్దదైనా అగ్గువే. అది రుసీ పసీ వుండదు, సప్పగా వుంటాది. తింటే కడుపునిండుతాదంతే. తెల్లవార్జామున ప్యాటకు కాయలెత్తకపోయిన అమ్మా నాయినా రెండ్రూపాయిలు కర్సుబెట్టి దోసో, ఇడ్లో తినకుండా పరగడుపుతోనే వస్తారు. అమ్మా నాయినేగాదు, నెత్తిమీద గంపల్తో మారికెట్టుకు పోయేవాళ్ళంతా ఇంతే. ఎప్పుడన్నా తింటే బువ్వ ల్యాకుండా కూజాకాయితిని వుంటారుగానీ, రకం కాయను తిన్లేరు. మేల్రకం కాయను సూసినప్పుడు దీనికెంత లెక్క వస్తాదో అని తప్ప, దీన్ని తిందామని అనుకోరు.

"మనది యింగన్, బత్తాసాల బతుకు కాదురా నాయినా, కూజా కాయ బతుకురా" అని నాయిన అన్న మాట గ్యాపకం వచ్చింది కొండిగాడికి. ఈ మాట వాళ్ళ నాయిన ఏదో ఒక్కసారి అనలా, ఎన్నోమాట్లు అంటానే వుంటాడు. ఈ మాటలో వున్న నిజం కొండిగాడు యింతప్పట్నించీ సూస్తా వచ్చిందే. ఈశ్వరయ్య కొడుకులు వాళ్ళతోపాటు సదువుకొనే సావాసగాళ్ళతో కల్సి తోటకాడికొచ్చినప్పుడు సూస్తా వచ్చిందే. వాళ్ళొచ్చినప్పుడు. నాయిన మంచి మంచి కాయలు తెచ్చి కోసి పెడ్తే, వాళ్ళు ఒకటి రెండు ఒప్పులు[7] తినీ, సగం తినీ పారేసేవాళ్ళు.

---

1) చోట 2) పంగల కొయ్య 3) కర్బూజా కాయ
4) లైన్లలో 5) కొంచెం చెడు వాసన 6) చిన్నగంప 7) ముక్కలు

సెట్లకు పాదుల్తీసి, ఎరువూ, గానిగసెక్కా, సెనిక్కాయ సెక్కాయేసి, వాటి తీగెలు తిప్పి, సుట్టా కంచె నాటుకోని, రాత్రింబవళ్ళూ తోటను సూపెట్టుకోని వుండేవాళ్ళు ఒక కాయను కోసుకోని తెగిచ్చి తిన్లేరు. తోటకోసం ఏ కట్టం సేయనోళ్ళు వచ్చి యిట్ట మెచ్చిన కాయలు తినీ, పారేసీ, నగుకుంటా మూతి తుడ్సుకొని పోతారు. ఈశ్వరయ్య వాళ్ళ రైతు, యాటా వాళ్ళు కరుబుజ్జ తోట ఏసుకొనేందుకు అప్పు యిస్తాడు, అప్పు వడ్డీతో గూడా తీర్సాల్సిందే. అయినా, ఆయన వాళ్ళ రైతు అయినందుకూ, అట్టా అప్పు యిస్తా వున్నెందుకూ గాను ఆయన ఇంటోళ్ళు తినేందుకు కొంత తోటను యేరేగా యేసిపెడ్తారు. మిగిల్న తోటతోపాటు దీనికీ వాళ్ళే సాకిరీ సేస్తారు. ఆ ఇంటోళ్ళు తోటకాడికొస్తే వాళ్ళ బాగంలోని కాయల్నే తినాల్ననీ, పారేయాల్ననీ లేదు.

ఈ కరుబుజ్జ తోటలు యేసుకొనేవాళ్ళు పూర్తిగా ఎవసాయం పనులు తెల్సినోళ్ళూ, సేసేవాళ్ళూ కాదు. యాడాదిలో పనులుండేది రెండు మూన్నెళ్ళయితే, ఎండాకాలం ఏ పనులూ వుండవు. అప్పుడయితే ఈళ్ళకు బాకీలు గూడా పుట్టవు. ఈ తోటలు యేసుకోని, పదో ఇరవయ్యో మిగిలిచ్చుకొంటే.... ఎండాకాలంలో కొంత ఆదరువుగా వుంటాదనుకొంటారు. అందుకే ఈ తోటలు పనులయిపోయే శివరాత్రి నుంచి మొదల్లై, ఉగాది పోయేప్పటికి ఉడిగేట్టుగా యేసుకొంటారు. కొండిగాని నాయిన బక్కోడు యాటా ఏస్తా వుంటాడు కరుబుజ్జ తోట. కొండిగాడు సేతి కందేదాకా ఆలూ మొగుడూ యిద్దరే పాదులు దీసేకాన్నుంచీ అంతపనీ సేసుకొంటా వచ్చినారు.

బక్కోళ్ళ తోటలో యిప్పుడు రోజుకు అయిదారు గంపల కాయలు తెగుతాండాయి. కాయలు గూడా మంచిరకం కాయలయినందువల్ల రేటు బాగానే పలుకుతాండాది. రోజూ మారికెట్టులో కాయలమ్ముకోని వస్తానే సద్ది బువ్వలు తినకుండా ముగ్గరూ ఆ పొద్దు ఎంత లెక్క వచ్చిందో, అట్టా వస్తే ఎన్నాళ్ళలో అప్పు తీర్తాదో లెక్కలేస్తా వుండారు. మాపటేల కాయలు తెంచి గంపలకు సేర్సి పెట్టుకోని, తెల్లవార్జామున్నే లేసి పునికెపగిలేదీ. మెడలు యిరిగేదీ సూడకుండా పోడం, రావడం సేస్తావుండారు. పోను అయిదు మైళ్ళు, రాను అయిదు మైళ్ళు ఆదలా బాదలా పోవడం, కాలిక్కాలికి కొట్టుకొంటా రావడం.

ఆరోజు సగిర పొద్దున పై తోటలవాళ్ళు క్యారు బ్యారుమని అర్సుతావుంటే, లేసి సూస్తా యింగేముంది? సెట్లన్నీ నీళ్ళలో మునిగి జుట్లు కనపడ్తా వుండాయి. గుడిసె గద్దమీదుండడంవల్ల నీళ్ళొచ్చినట్టే తెల లేదు. మొబ్బు లేదు, మోడం లేదు, ఉరుము లేదు, మెరుపు లేదు. వున్నట్టుండి రాత్రిపూట దొంగోని మాదిరి వచ్చింది ఏరు. తెల్లవార్నాక సూస్తే తోటంతా మునిగిపోయింది. ముగ్గురూ అట్టనే కూకొని సూస్తా వుండారు. ఎన్ని కాయలు పాయె, ఎంత లెక్క పాయె! ఎంత అప్పు మిగిలె !

మెల్లిగా నీళ్ళు గుడిసెకాడి క్కూడా వస్తా వుండాయి. లేసి సూస్తే నిన్న తెంపిన కాయలు గంపల్లో అట్టనే వుండాయి. తెల్లవార్జామున్నే పోయేందుకు కాల్లాడకపాయె ! ఇవతల తోటే పోతావుంటే ఈ రోన్ని కాయల్తో ఏమయితాది? అట్టయితే యియిగూడా సెడిపోతే, వచ్చే లెక్క పోయినట్టేగదా ! అందులో మంచి కాయలు ! అల్చెమయితే అయింది, పోదాం పా, ఆకిర్రోజుకద. ఇన్నాళ్ళ కట్టాన్ని తోట మింగితే, తోటను ఏరు మింగె. "కొనండయా.... మా కరుబుజ్జ కాయా, కొని రుచి చూడండి.... ఏరూ వచ్చి ఎదరకపోతే మారేలేదండి" అని పాడిన బాలేపీరాన్ పాట గ్యాపకమొచ్చింది వాళ్ళకు.

ముగ్గరూ గంపలెత్తుకోని పొద్దటూరు మారికెట్టు దావబట్టిరి. తోటంతా మునిగిపోయి, గంపల్లో కాయలు మిగిల్తే "ఈ కాయల్ను ఎన్నడూ తిన్నోళ్ళం గాదు యిప్పుడన్నా తిందాం" అనుకోల్యాకపోయిరి!